## క్లుప్తంగా

### పేస్ కాలేజీతో ఐసీటీ అకాడమీ ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న పేస్ కాలేజీ కరస్పాండెంట్ శ్రీధర్, చెన్నై ఐసీటీ అకాడమీ ప్రతినిధి రామకృష్ణ

ఒంగోలు: చెన్నైలోని ఐసీటీ అకాడమీ తమ కాలేజీతో ఒప్పందం కుదుర్చుకుందని పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ సోమవారం ప్రకటించారు. ఈ ఒప్పందం ఒక సంవత్సరంపాటు అమలులో ఉంటుందన్నారు. దీని ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఉపయోగకరమైన వర్క్‌షాప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫైడ్ కోర్సులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు సాయం



సాయం అందజేస్తున్న మహబూబ్

ఒంగోలు టౌన్: స్థానిక దత్తాత్రేయకాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ సోమవారం ఆర్థికసాయం అందజేశారు. బాధితులను పరామర్శించిన నిత్యావసర వస్తువులు కూడా అందజేశారు.

### స్పందనకు 17 అర్జీలు

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 6 అర్జీలు, నగర ప్రణాళికా విభాగానికి సంబంధించి 3, శానిటేషన్ విభాగానికి 3, రెవెన్యూ విభాగానికి 3, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు వచ్చినట్లు వివరించారు. వాటిని ఆయా విభాగాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నూతన సాంకేతికతతో నాణ్యమైన పొగాకు

ఒంగోలు సెంట్రల్: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పొగనారు మడులు సాగు చేస్తే నాణ్యమైన పొగాకు ఉత్పత్తి అయి రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందని ఐటీసీ అధికారి యశ్వంత్ పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో రైతులకు పంట నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐటీసీ అధికారి యశ్వంత్ మాట్లాడుతూ.. ట్రేలలో పొగాకు నారు పెంపకం వల్ల నూరు శాతం మొలక వస్తుందని, పోషకాలు కూడ సక్రమంగా అందివచ్చన్నారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ, కంది, మిరప వైపు మొగ్గుచూపాలని కోరారు. ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి కోవి రామకృష్ణ మాట్లాడుతూ.. బ్యారన్‌కు 3,550 కేజీల వరకే బోర్డు అనుమతి ఇచ్చిందని స్పష్టం చేశారు. ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### పరిధికి మించి వైద్యం చేసే ఆర్‌ఎంపీలపై చర్యలు

ఒంగోలు టౌన్: తమ పరిధికి మించి వైద్యం చేసే ఆర్‌ఎంపీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి హెచ్చరించారు. సోమవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌ఎంపీలు వారి అర్హతలతో సంబంధం లేకుండా వైద్యం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని స్పష్టం చేశారు.

# పేదల ఆరోగ్యమే ముఖ్యమంత్రి లక్ష్యం

- అందుకోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ యాదాల అశోక్‌బాబు



ఏడుగుండ్లపాడులో ప్రజలకు మందులు అందిస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ యాదాల అశోక్‌బాబు



మోటుమాలలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సురక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి భగీరథ, తదితరులు

మద్దిపాడు: పేద ప్రజలందరికీ ఆరోగ్యం అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకే ఇటువంటి మెడికల్ క్యాంపులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా నెలలో నాలుగు రోజుల పాటు ప్రతి గ్రామానికి డాక్టర్లు వెళ్లే విధంగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, ఇకపై గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడే వారు ఉండకూడదని అన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా ముఖ్యమంత్రి ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో వెయ్యి రోగాలకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తించగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోని వచ్చాక 3,250 రకాల రోగాలను ఆరోగ్యశ్రీ కింద చేర్చి పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారని వివరించారు. ప్రజలు ఈ విషయాలు తెలుసుకోవాలని, వైద్యశాఖ సిబ్బంది మెరుగైన వైద్యం అందించే క్రమంలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ గురించి రోగులకు అవగాహన కల్పించాలని కోరారు. మెడికల్ క్యాంపుల్లో డాక్టర్లు కూడా అవసరమైన రోగులను కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫార్సు చేయాలని కోరారు. ముందుగా మెడికల్ క్యాంప్‌లో స్టాల్స్‌ను అశోక్‌బాబు పరిశీలించారు. చివరిగా రోగులకు ఆయన చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీ, సీనియర్ నాయకులు బాలాంజిరెడ్డి, గుడ్డపాతల రవి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, సర్పంచ్ శిల్పసౌందర్య, ఎంపీటీసీ బొమ్మల దాసు, జనరల్ సర్జన్ రామచంద్రారెడ్డి, స్త్రీల వైద్యనిపుణులు హేమాంజలి, మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్యశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**మోటుమాలలో 425 మందికి వైద్య పరీక్షలు...**

మోటుమాల (కొత్తపట్నం): మోటుమాల గ్రామంలో సర్పంచ్ కోడూరి గోపి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి భగీరథ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతానికి సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు వచ్చి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం అదృష్టమన్నారు. క్యాంప్‌లో ఎంతో మందికి వ్యాధులు బయటపడటంతో జాగ్రత్త పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. కొంత మంది కార్పొరేట్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం వలన ఆపరేషన్లు చేయించి ఎంతో మంది ప్రాణాలు కాపాడటం జరిగిందన్నారు. శిబిరంలో మొత్తం 425 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళ్లజోళ్లు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డాక్టర్ వైష్ణవి, ఎంపీటీసీ సభ్యుడు పురిణి వెంకట్రావు, సచివాలయ కన్వీనర్ కోడూరి వెంకటరెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్ అనూరాధ, డాక్టర్ శివపార్వతి, రమణారెడ్డి, శరత్‌బాబు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

**పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష...**

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరంగా మారిందని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గద్దలగుంట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) పరిధిలోని బాలాజీరావుపేట వార్డు సచివాలయం పరిధిలో గల టంగుటూరు ప్రకాశం మున్సిపల్ హైస్కూల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గద్దలగుంట యూపీహెచ్‌సీ పరిధిలోని భాగ్యనగర్, గద్దలగుంట-1, 2, రాజాపానగల్‌రోడ్డు-2, కేశవస్వామిపేట, బాలాజీరావుపేట, విజయనగర్‌కాలనీ, గుర్రంవారివీధి, దేవుని చెరువు, ధారావారితోట వార్డు సచివాలయాల ప్రజల కోసం ప్రత్యేకంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కోటవీధి, గాంధీ రోడ్డు, గానుగపాలెం సచివాలయాల నుంచి సుమారు 290 మంది వచ్చి శిబిరంలో పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. క్యాంపులో ఇద్దరు జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు, ఒక ఆప్తమాలజీ, ఒక కార్డియాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందిని మెరుగైన వైద్యం కోసం దగ్గరలో ఆరోగ్య శ్రీ సేవలందించే వైద్యశాలలకు పంపించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎంహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, ఎంఈ జానీ, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, ఎంఈ జానీ, డీఈ పద్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఒంగోలులో మందులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



మద్దులూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

**మద్దులూరులో...**

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో స్థానిక ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ బీ శైలజ సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీటీసీ కే సుబ్బారావు, గ్రామ నాయకులు మైనం అమర్‌నాథ్, బోడెంపూడి శ్రీనివాసరావు, దుంపా యలమందారెడ్డి, చుట్టుపక్కల గ్రామాల నుంచి సర్పంచ్‌లు, నాయకులు, వైద్యసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# గాయత్రీదేవికి ఘనంగా పూజలు



గాయత్రీదేవి అలంకరణలో లాయర్‌పేట బాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి



పార్వతీదేవి అలంకరణలో గంటాపాలెం పార్వతీదేవి అమ్మవారు



గాయత్రీదేవి అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి అమ్మవారు

ఒంగోలు మెట్రో: దసరా దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఒంగోలు నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో గాయత్రీదేవిగా అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గాంధీరోడ్డులోని గీతామందిరంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. విద్యుత్ దీపాలంకరణతో వెలుగులు విరజిమ్మాయి.

**చీమకుర్తిలో శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల పూజలు...**

చీమకుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో అమ్మవారు సోమవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ముందురోజు ఆదివారం రాత్రి శరన్నవరాత్రుల ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా బాలా త్రిపురసుందరీదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం చీమకుర్తి ఇసుకవాగులోని సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని కామాక్షి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు



లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో రాజేశ్వరీ కళ్యాణం కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శన...

### చేతులు శుభ్రం చేసుకున్న తర్వాతే తినాలి

ఒంగోలు టౌన్: చేతులు శుభ్రం చేసుకున్న తర్వాతే మనం ఏదైనా తినాలని, లేకపోతే అనేక రకాల వ్యాధులకు గురికావాల్సి వస్తుందని జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా.బాలాజీనాయక్ తెలిపారు. అంతర్జాతీయ హ్యాండ్ వాషింగ్ డేని పురస్కరించుకుని సోమవారం జీజీహెచ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పనుల ఒత్తిడి ఎంత ఉన్నప్పటికీ తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు. జీజీహెచ్ నోడల్ అధికారి డాక్టర్ నామినేని కిరణ్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ జయశ్రీ, పలువురు సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఒంగోలు సిటీ: బాల్య వివాహ రహిత జిల్లాగా ప్రకాశంను తీర్చిదిద్దాలని ఒంగోలు అర్బన్ సీడీపీఓ ఫణిరాజకుమారి కోరారు. సోమవారం కె.ఎస్.సీ.ఎఫ్, సార్డ్ ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా బత్తులవారికుంట సచివాలయం పరిధిలో నిర్వహించిన ర్యాలీలో సీడీపీఓ మాట్లాడారు. బాల్య వివాహాల వలన జరిగే నష్టాలను వివరించారు. ఏఎస్సై చంద్రలీల, కార్పొరేటర్ నాగభూషణ్, సార్డ్ కో ఆర్డినేటర్ రాజేష్, లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొని బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేశారు.

**మోటుమాలలో...**

మోటుమాల (కొత్తపట్నం): గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయన, అరికట్టాలని తహసీల్దార్ బీవీ రమణారావు కోరారు. బాల్య వివాహ రహిత భారతదేశం, బాలల భద్రతే భారత్ భద్రత కార్యక్రమాన్ని సర్పంచ్ కోడూరి గోపి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఎనీమియా, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్, విద్య గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం కచ్చితంగా బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు చేసిన పెద్దలకు రెండేళ్ల జైలు శిక్ష వేస్తారని హెచ్చరించారు. అనంతరం బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డాక్టర్ వైష్ణవి, సర్పంచ్ కోడూరి గోపి, సూపర్‌వైజర్ అనూరాధ, కోడూరి వెంకారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, లావణ్య, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



మోటుమాలలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రమణారావు

**చీమకుర్తిలో...**

చీమకుర్తి: బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ కేపీ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై స్వయం సహాయక గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. గ్రామాలలోని మహిళలందరికీ బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలు వివరించాలన్నారు. ప్రత్యేకంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేయాలని ఎంపీపీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీఎం ఎల్.కోటేశ్వరరావు, స్థానిక స్వయం సహాయక గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

### తిరుమలలో పుట్టినరోజు జరుపుకున్న శిద్దా సుధీర్

ఒంగోలు: టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను సోమవారం తిరుమలలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో అభిమానుల మధ్య ముందస్తు వేడుకల్లో పాల్గొన్న సోమవారం తిరుమల చేరుకుని కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు, వేద పండితులు శిద్దా సుధీర్‌కుమార్ దంపతులకు రంగనాయక మండపంలో వేద ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు బహూకరించారు. అదేవిధంగా ఒంగోలులోని రిమ్స్ వద్ద పేదలకు యూఎస్ ఎక్స్‌పోర్ట్స్ అధినేత జి.హరి ఆధ్వర్యంలో శిద్దా సుధీర్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి నిర్వహణలోని నిత్య అన్నదాన వాహనం ద్వారా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు దుప్పట్ల పంపిణీ...**

చీమకుర్తి: శిద్దా సుధీర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం గోల్డెన్ గ్రానైట్ క్వారీ యజమాని గిరి ఆధ్వర్యంలో చీమకుర్తి గంగాకాలనీలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం చీమకుర్తి ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో పరాంకుశం శ్రీనివాసమూర్తి, ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న శిద్దా సుధీర్‌కుమార్ కుటుంబం



ఒంగోలులో అన్నదాన కార్యక్రమం